AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN

డివైడర్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

అక్షరటుడే, కర్నూల్: ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదం కలకలం రేపింది. పాండిచేరి నుంచి హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్న కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కర్నూలు నగర శివారులోని టిడ్కో హౌస్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ఒక్కసారిగా అదుపు తప్పింది. వేగంగా దూసుకెళ్లిన బస్సు డివైడర్‌ను ఢీకొట్టి రాంగ్ రూట్‌లోకి వెళ్లింది. ఆ సమయంలో ఎదురుగా వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. బస్సులో మొత్తం 29 మంది ప్రయాణీకులు ఉండగా, అందరూ సురక్షితంగా బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

అమెరికాలో ఘోర మంచు తుఫాను..



అక్షరటుడే, నేషనల్‌డెస్క్: అమెరికా తూర్పు, మధ్య ప్రాంతాలను రెండు రోజులుగా అతలాకుతలం చేస్తున్న భారీ మంచు తుఫాను దేశవ్యాప్తంగా భారీ నష్టాలకు కారణమైంది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా మంగళవారం ఉదయం నాటికి సుమారు 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆర్కిటిక్ శీతల గాలుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు మైనస్ 40 డిగ్రీల వద్దకు పడిపోయి, ప్రజల సాధారణ జీవనచక్రాన్ని పూర్తిగా నిలిపివేశాయి. తుఫానుతో మౌలిక సదుపాయాలు ఘాతుకరంగా దెబ్బతిన్నాయి.

27-1-2026 (Tuesday) MAIN EDITION

'జన నాయగన్' సినిమాకు షాక్..

అక్షరటుడే, సినిమాడెస్క్: తమిళ హీరో, టీవీకే పార్టీ అధినేత విజయ్ నటించిన జన నాయగన్ సినిమాకు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. దీంతో సినిమా విడుదల మరింత ఆలస్యం కానుంది. విజయ్ పూర్తి స్థాయి రాజకీయాల్లోకి వచ్చిన విషయం తెలిసిందే.

చర్చలు జరుపుతూనే దాడులు

అక్షరటుడే, నేషనల్ డెస్క్: రష్యా ఓ వైపు చర్చలు జరుపుతూనే మరోవైపు డ్రోన్లతో దాడులు చేస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మండిపడ్డారు. పలు ప్రాంతాల్లో రష్యా 165కు పైగా డ్రోన్లతో దాడులు చేసిందని ఆరోపించారు. వాటిలో చాలా వాటిని నిర్వీర్యం చేశామని పేర్కొన్నారు. చర్చల్లో భాగస్వామ్యం వహిస్తున్న యూఎస్, యూరప్ ఈ చర్యను ఖండించాలన్నారు.

బంగ్లాకు మళ్లీ షాకిచ్చిన ఐసీసీ

అక్షరటుడే, నేషనల్ డెస్క్: భద్రతా కారణాలతోఓ ఇండియాలో టీ20 వరల్డ్ కప్ ఆడబోమన్న బంగ్లాదేశ్‌కు ఐసీసీ మరోసారి షాక్ ఇచిచంది. ఆ దేశ జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ కార్డులను నిరాకరించింది. 130–150 మంది జర్నలిస్టులు అప్లయ్ చేసుకోగా ఒక్కరికీ ఐసీసీ పర్మిషన్ ఇవ్వలేదని సమాచారం.

సైబర్ నేరగాళ్ల అరెస్ట్

అక్షరటుడే, హైదరాబాద్ : తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో భారీ ఆపరేషన్ చేపట్టింది. కేరళ, బెంగళూరులో ఆరుగురు సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసింది. వారు రూ.16.20 కోట్ల సైబర్ మోసాలకు పాల్పడ్డట్లు పోలీసులు గుర్తించారు. డిజిటల్ అరెస్ట్‌లు, ట్రేడింగ్, కొరియర్ల పేరిట ప్రజలను మోసం చేశారు. మ్యూల్ అకౌంట్ల ద్వారా విదేశాలకు నగదు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న ప్రధాన సైబర్ నేరగాళ్ల కోసం గాలిస్తున్నామన్నారు.

దివ్యాంగుల కోసం రూ.100 కోట్లు

అక్షరటుడే, ఖమ్మం : కాంగ్రెస్ ప్రభుత్వంలో దివ్యాంగుల సంక్షేమం కోసం రూ.100 కోట్లు ఖర్చు చేసినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గత దశాబ్ద కాలంలో జరగని పనిని తమ ప్రభుత్వం రెండు సంవత్సరాలలోనే చేసిందన్నారు. మధిరలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. దివ్యాంగ విద్యార్థులకు ఐప్యాడ్‌లు, కంప్యూటర్లు, ట్యాబ్‌లు ఇస్తున్నట్లు తెలిపారు. అంగవైకల్యం అనేది ఎదిగేందుకు అడ్డంకి కాకూడదని, వారిని సమాజంలో మనతో సమానంగా గౌరవప్రదమైన స్థితిలోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

భారత్–ఈయూ ట్రేడ్ డీల్..

అక్షరటుడే, నేషనల్ డెస్క్: భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య చారిత్రాత్మక ట్రేడ్ డీల్ కుదిరింది. దీనిని మదర్ ఆఫ్ డీల్స్‌గా ప్రధాన మంత్రి మోదీ అభివర్ణించారు. భారత్–ఈయూ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో ఇరు దేశాలకు మేలు జరగనుంది. ఈ ఒప్పందంతో దాదాపు 90శాతం భారత ఉత్పత్తులకు ఐరోపా మార్కెట్‌లో ఎలాంటి టారిఫ్‌లు ఉండవని తెలుస్తోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు విధిస్తుండడంతో.. భారత్ ఆ దేశంతో చర్చలు జరుపుతూనే.. ప్రత్యామ్నాయా మార్కెట్‌లపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో ఈ ట్రేడ్ డీల్ కుదరడం గమనార్హం.



ఎన్నో రోజుల నుంచి ఉత్కంఠగా ఎదురు చూస్తున్న మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం సాయంత్రం షెడ్యూల్ విడుదల చేశారు. ఒకే విడతలో ఎన్నికలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. షెడ్యూల్ వెలువడటంతో నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది.

–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

మోగిన నగారా

- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- ఫిబ్రవరి 11న ఎన్నికలు
- 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎలక్షన్

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం మున్సిపల్ ఎన్నికల వివరాలు వెల్లడించారు. ఈ నెల 28 తేదిన నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ఈ నెల 28వ తేదీ నుంచి 30 వరకు నామినేషన్లు స్వీకరణ ఉంటుందని, 31 తేదిన నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 03న ఉపసంహరణ ఉంటుందన్నారు. ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. 13న కౌంటింగ్ ప్రక్రియ చేపట్టి ఫలితాలు విడుదల చేస్తామన్నారు. అనంతరం 16వ తేదీన మేయర్లు, డిప్యూటీ మేర్లు, మున్సిపల్ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్ల ఎన్నిక నిర్వహించనున్నారు.

2,996 వార్డులకు..

రాష్ట్రంలో పదవీకాలం పూర్తయిన 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వార్డులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్, మేయర్ పదవుల రిజర్వేషన్‌లు ఖరారు కావడంతో ఆశావహులు షెడ్యూల్ కోసం కొంతకాలంగా నిరిక్షిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఎన్నికల కమిషనర్ షెడ్యూల్ విడుదల చేశారు. అంతకుముందు ఆమె రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు.

సమయం లేదు..

మున్సిపల్ ఎన్నికలకు సమయం తక్కువగా ఉండటంతో రాజకీయ పార్టీలు జోరుగా పెంచాయి. ఇప్పటికే అధికార కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో ముందు ఉంది. ఆ పార్టీ నాయకులు జోరుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మరోవైపు బీజేపీ, బీఆర్ఎస్ సైతం మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాయి.

ఇప్పటికే అన్ని పార్టీల ఆశావహులు టికెట్ల కోసం జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. రిజర్వేషన్లు ఖరారు అయిన నాటి నుంచి పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నం అయ్యారు. మరోవైపు పార్టీలు సైతం ఒకటి, రెండు రోజుల్లో అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం ఉంది. తమకే టికెట్ వస్తుందని అనుకుంటున్న పలువురు ఇప్పటికే తమ వార్డుల పరిధిలో ప్రచారం ప్రారంభించారు.

సంతోష్‌రావు.. సీఎం రేవంత్ గూఢచారి..: కవిత

అక్షరటుడే, హైదరాబాద్: బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీ సంతోష్‌రావుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గూఢచారి అని ఆరోపించారు. నిజామాబాద్ జిల్లాలో ఇటీవల గంజాయి ముఠా కారుతో ఢీకొన్న గాయపడ్డ కానిస్టేబుల్ సౌమ్యను కవిత మంగళవారం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో పరామర్శించారు. అనంతరం ఆస్పత్రి బయట మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌కు, ఉద్యమ నాయకుడు కేసీఆర్‌కు ఉద్యమకారులు, పేదలు దూరం అయ్యారంటే సంతోష్‌రావే కారణమన్నారు. ఈటల రాజేందర్ పార్టీ వీడానికి కూడా ఆ దెయ్యమే కారణమని సంచలన వ్యాఖ్యలు చేశారు. గద్దర్‌లాంటి వాళ్లు ప్రగతిభవన్ గేట్ బయట ఉండాల్సి రావడానికి సంతోష్‌రావు కారణమని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన గూఢచారి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయనకు శిక్ష పడుతుందనే నమ్మకం లేదని చెప్పారు.

కార్పొరేట్ విద్యా సంస్థలను బంద్ చేస్తా: కోమటిరెడ్డి

అక్షరటుడే, హైదరాబాద్: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు విద్యాశాఖ మంత్రిగా అవకాశం వస్తే కార్పొరేట్ స్కూళ్లను బంద్ చేయిస్తానన్నారు. కోమటిరెడ్డి కుమారుడు ప్రతీక్‌రెడ్డి పేరిట కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను పునర్నించారు. నల్గొండ జిల్లా బొట్టుగూడలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను రూ.8 కోట్లతో అన్ని సౌకర్యాలు, అత్యాధునిక హంగులతో ప్రతీక్ ఫౌండేషన్ పునర్నిర్మాణం చేసింది. ఈ పాఠశాలను మంత్రి కోమటిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్పొరేట్ కాలేజీలు విద్యను అమ్ముకుంటున్నాయన్నారు. విద్యా వ్యాపారం కాదన్నారు. కార్పొరేట్ కాలేజీల్లో డిగ్రీ చేసిన వారు మాత్రమే చదువు చెబుతారన్నారు. కానీ ప్రభుత్వ కాలేజీల్లో పీహెచ్‌డీలు చేసిన వారు ఉంటారని చెప్పారు. ఎంతో టాలెంటెడ్ అధ్యాపకులు ఉన్నా.. ప్రభుత్వ కాలేజీల్లో విద్యార్థులు చేరడం లేదన్నారు. కార్పొరేట్ కాలేజీల్లో బట్టి పట్టించడంతో ఎంతో మంది విద్యార్థులు ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్.. వైద్యురాలి మృతి

అక్షరటుడే, వరంగల్: ఓ బైక్‌ను వెనుక నుంచి టిప్పర్ కొనగా ప్రమాదంలో ఓ వైద్యురాలు మృతి చెందింది. ఈ ఘటన సోమవారం రాత్రి వరంగల్‌లో చోటు చేసుకుంది. కర్ణాటకలోని గుల్బర్గా జిల్లా చించోలి మండలం బత్తంపల్లికి చెందిన మమతా రాణి డాక్టర్. ఆమె వరంగల్‌లోని హంటర్‌రోడ్డులోని ఫాదర్ కొలంబో ఆస్పత్రిలో పని చేస్తున్నారు. సోమవారం రాత్రి డ్యూటీ అయిపోయిన తర్వాత బైక్‌పై భర్తతో కలిసి ఆమె ఇంటికి వెళ్తుండగా ఓ టిప్పర్ ఢీకొంది. ఈ ఘటనలో దంపతులు ఇద్దరు కింద పడిపోయారు. తొమ్మిది నెలల గర్భిణి అయిన మమత తీవ్రంగా గాయపడింది. స్థానికుల సాయంతో ఆమెను భర్త ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అక్షరటుడే, హైదరాబాద్ : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగులకు రిటైర్మెంట్ బెన్ఫిట్స్ చెల్లించాలని బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చౌక్‌లో మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వారిని మోసం చేసిందని విమర్శించారు. పదవీ విరమణ ప్రయోజనాలను విడుదల చేయడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. వేతన సవరణ కమిషన్ అమలులో జాప్యం చేసిందని మండిపడ్డారు. విరమణ చేసిన ఉద్యోగులు తమ న్యాయమైన బకాయిల పోరాటం చేయాల్సి వస్తోందన్నారు.

క్యాస్టింగ్ కౌచ్‌పై చిన్మయి సంచలన వ్యాఖ్యలు

క్యాస్టింగ్ కౌచ్‌పై సింగర్ చిన్మయ్ మరోసారి స్పందించారు. చిత్ర పరిశ్రమలో మహిళలు కమిట్‌మెంట్ ఇస్తేనే అవకాశాలు వస్తాయన్నారు. లేకపోతే ఛాన్స్‌లు ఇవ్వకుండా వేధిస్తారని చెప్పారు. మెగాస్టార్ చిరంజీవి ఇటీవల 'మన శంకర వరప్రసాద్ గారు' మూవీ సక్సెస్ మీట్‌లో మాట్లాడుతూ.. తెలుగు పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ లేదన్నారు. ఫిలిం ఇండస్ట్రీ అద్దం లాంటిదని ఆయన అన్నారు. ఆయన వ్యాఖ్యలపై సింగర్ చిన్మయ్ తాజాగా స్పందించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పోస్ట్ పెట్టారు. క్యాస్టింగ్ కౌచ్‌పై చిరంజీవి వ్యాఖ్యలను చిన్మయి ఖండించారు. చిత్ర పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ ఉందన్నారు. ఇక్కడ కమిట్మెంట్ అనే పదానికి అర్థం పూర్తిగా వేరని చెప్పారు. మహిళలు తమ శరీరాన్ని అప్పగించకపోతే అవకాశాలు రావన్నారు. అప్పట్లో నటీనటుల మధ్య గౌరవప్రదమైన సంబంధాలు ఉండేవని ఆమె పేర్కొన్నారు. చిరంజీవి జనరేషన్‌లో మహిళా ఆర్టిస్టులను గౌరవించేవారన్నారు. అయితే ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవన్నారు.

- అక్షరటుడే, సినిమాడెస్క్

పలువురు డీఎస్పీల బదిలీ

అక్షరటుడే, హైదరాబాద్: రాష్ట్రంలో పలువురు డీఎస్పీలు, ఏసీపీలు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ శివధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం 10 మందికి స్థానచలనం కలిగించగా.. తాజాగా ఐదుగురిని ట్రాన్స్‌ఫర్ చేశారు. పోలీస్ అకాడమీలో పనిచేస్తున్న సారంగపాణిని రెండు రోజుల క్రితం ప్రభుత్వం కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు ట్రాన్స్‌ఫర్ చేశారు. తాజాగా ఆ బదిలీని రద్దు చేశారు. ఆయనను ఖమ్మం జిల్లా వైరా ఏసీపీగా పంపించారు. అక్కడకు ఇటీవల బదిలీ అయిన పద్మనాబుల శ్రీనివాస్‌ను జీహెచ్ ఎంసీ పరిధిలో డీఎస్పీగా నియమించారు. ఇంటెలిజెన్స్‌లో డీఎస్పీగా పని చేస్తున్న వెంకన్నబాబును ఇల్లందు డీఎస్పీగా బదిలీ చేశారు. సైబరాబాద్ స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న ఏసీపీ బి ప్రకాశ్‌ను నిజామాబాద్ ఏసీపీగా పంపించారు. అక్కడ పని చేస్తున్న రాజా వెంకట రెడ్డిని డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.